# కొప్పుల శివశేఖర్

# శిథిల వాదాలు

అతనికోసం తనెందుకు బాధపడాలి?

అతనెవరు? తనెవరు?

తనకంటే ఎంతో వెనుక పుట్టాడు.

వయసులో చిన్నవాడైనా అతని మహోన్నత వ్యక్తిత్వం ముందు తన వ్యక్తిత్వం అణువయి పోయింది.

ఏడాది అనుబంధంలో ఎన్నో జన్మల బంధంగా కలిసిపోయాడు.

కళ్ళముందు అతని రూపం మెదులుతుంది.

గుండెలు బాధతో బరువెక్కిపోతున్నాయి. ఏదో నేరం చేసినట్లు మనసు గిల్టీగా ఫీలవుతోంది.

తనకి ఓదార్పు కావాలి, మనశ్శాంతి కావాలి.

ఎవరు ఓదార్చుతారు? ఎక్కడుంది మనశ్శాంతి?

కావలసినంత ఐశ్వర్యం వుండి కూడా ఈ యింట్లో తను వంటరి.

ఇరవై ఎనిమిదేళ్ళకే తనకి వైధవ్యం, వైరాగ్యం ప్రాప్తించేశాయి. చేసుకున్న పాపమేమిటోగానీ పిల్లలు కూడా కలగలేదు.

ఆయన చనిపోయాక తను వంటరిగా మిగిలి పోయింది. అప్పట్నించి మనశ్శాంతి కరువై, బ్రతుకు బరువై పోయింది. తనని ప్రేమించి లాలించే మనిషికోసం అల్లాడిపోయింది. తనకంటూ ఎవరున్నారు? ఎవరూ లేరు!

ఏడాదిక్రితం అతను పరిచయమైనాడు. ఏదో మనశ్శాంతి లభించినట్లు, ప్రశాంతత చేకూరినట్లని పించింది.

అతను తనపట్ల చూపించిన విధేయతకు, అనురాగానికి కరిగిపోయింది. ఆ సమయంలో అతన్ని దగ్గరకు పిలిచి, యింకా దగ్గరకు హత్తుకు పోయి, అతని గుండెలమీద వాలిపోయి, హాయిగా వొదిగిపోవాలనిపించేది.

కానీ...ఎలా?

అతనేమనుకుంటాడు?

అతని వయసెక్కడ? తన వయసెక్కడ?

ఇద్దరిమధ్య పదేళ్ళ వ్యత్యాసం.

ఈ వయసు తారతమ్యం లేకుండా వుంటే తన ప్రవర్తన యింకెలా వుండేదో? ఏమో?

అతనికొరకు ఎన్ని చేసింది తను.

అతను వుండటానికి ఓ బిల్డింగ్ ఏర్పాటు చేసింది. తన ఫరంలో హోదాగల ఉద్యోగం. డ్రైవింగ్ నేర్పించి, కారుకూడా యిచ్చింది. ఇన్ని సౌకర్యాలు చూసి అతను ఆనందపడిపోతాడను కుంది తను. కానీ అతని మొహంలో ఎటువంటి ఆనందమూ కన్పించేది కాదు.

అతనంటే తనకెందుకింత అభిమానమో, మరి ఎందుకింత యిష్టమో తెలిసేది కాదు. తన దృష్టిలో అతను ప్రత్యేకమయిన వ్యక్తి. ఈ హృదయంలో భర్త తరువాత అంతటి స్థానాన్ని అతనికి యివ్వగలిగింది తను.

భర్త....అంటే యిక్కడ మరో అర్థం స్ఫురిస్తుంది. ఆ అర్థానికి సరైన నిర్వచనం తన దగ్గర లేదు.

ఏమిటో ఈ మానసిక సంఘర్షణ. అటు ఇటు కాని తటస్థ వైఖరి. ఏమిటిది? ఎందుకిలా అయిపో తోంది తను?

అతన్నుంచి ఏదో కావాలని మనసు పడే ఆరాటం.

అది తప్పని, వలదని వారించే అంతరాత్మ పోరాటం

వాటిమధ్య తను నలిగిపోతూ, నరకయాతన్ని అనుభవిస్తూ, గుండెల్ని పదునైన కత్తులతో కోస్తున్న బాధ...చిత్రవధ.

అతనెప్పుడూ తనదగ్గరే వుండిపోవాలని పించేది. బెడ్‌మీద యిలా పక్కపక్కగా కూర్చుంటూ, కబుర్లు చెప్పుకుంటూ వుండిపోవాలి.

అలసిపోయి అతనొస్తుంటే, ఎదురెళ్ళి చిరు నవ్వుతో స్వాగతం చెప్పాలనుండేది. రోజూ అతన్ని చూడాలనే కోరిక. అతను రోజూ కనిపించేవాడు కాదు. బిజినెస్ వ్యవహారాలు మాట్లాడడానికి ఏ వారానికోసారో వచ్చేవాడు. వచ్చి తనముందు తల వంచుకొని నిలబడి మాట్లాడే వాడు. తన మొహంకేసి అసలు చూసేవాడు కాడు.

ఆ క్షణంలో అతన్ని చూస్తే పసిపిల్లాడు గుర్తొచ్చేవాడు.

పసిపిల్లవాడ్నయితే ఎత్తుకొని ముద్దాడవచ్చు. మరి! అతన్నెలా?

రోజూ అతని మాటలు వినాలనుండేది ఏదో వంకతో ఫోన్లో మాట్లాడుతూనే వుండేది. అతని మాటలు వింటూ తనని తానే మరిచిపోయేది.

ఇవన్నీ ఏమిటి?

ఎందుకిలా చేయాలనిపిస్తోంది?

ఏమిటీ బలహీనత?

అతనిమీద ఇన్ని ఆలోచనలు ఎందుకు?

రాత్రులు పూరంతా నిద్రపోతున్నా తన కెందుకు నిద్రపట్టదు?


ఎడారిలో ఒంటరిగా మిగిలిపోయిన బాటసారి అతను...

నడి సముద్రంలో మునిగిపోతున్న నిస్స హాయుడతను...

అతనికి త్రోవ చూపించి, చేయూతనిచ్చి వడ్డుకు లాగింది తను. లేకపోతే అతను ఏమయి పోయేవాడో?

ఆకలి మంటలకు తాళలేక వ్యక్తిత్వాన్ని చంపేసుకొని ఏ దొంగో అయిపోయేవాడు. అతని

**రోజూ అతని మాటలు వినాలనుండేది. ఏదో వంకతో ఫోన్లో మాట్లాడుతూనే వుండేది. అతని మాటలు వింటూ తననితానే మరిచిపోయేది. ఇవ్వన్నీ ఏమిటి? ఎందుకిలా చేయాలనిపిస్తోంది? ఏమిటీ బలహీనత....?**



ంగారు భవిష్యత్తు భయంకరంగా తయారయేది. చేరదీసి ఆదరించే వారు లేక చరిత్రలో అడ్రస్ లేని మనిషిగా చనిపోయేవాడేమో! ఏమో...చివ రికి ఏమయిపోయేవాడో?

అతని పరిచయం చాలా చిత్రంగా జరిగింది.

ఏడాది క్రితం—

ఓ చల్లని సాయంత్రం—

వెలుతురు జారిపోతున్న వేళ...

ప్రశాంతత కోసం కారు డ్రైవ్ చేసుకుంటూ బీచ్‌కి వెళ్ళింది తను. మనసు బాగోలేనప్పుడు సముద్రపు వడ్డున కూర్చుంటే ఏదో మానసికా నందం దొరికినట్లుగా వుండేది.

ఆయన బ్రతికున్న రోజుల్లో ఈ సముద్రపు ఒడ్డునే ఎన్నో చల్లని సాయంత్రాలు కరిగి పోయాయి.

ఆ అనుభవాల్ని ఆ జ్ఞాపకాల్ని ఈ ఇసుక తిన్నెలలో పాతేసి ఆయన వెళ్ళిపోయారు...మన సులో కోర్కెల్ని కెరటాలకు ఊడ్చి కొట్టి, ఆయన నిర్దయగా వెళ్ళిపోయారు.

బీచ్‌కి వస్తే ఎంతసేపు అక్కడి కూర్చుండి పోతుందో తనకే తెలీదు. ఆ రోజు కూడా ఎంత సమయం గడిచిపోయిందో తెలీదు.

చీకటి పడిపోయింది.

బీచ్‌లో జనం పల్చబడిపోయారు...

తను అక్కడ్నించి మెల్లిగా లేచి కారు దగ్గ రకు వచ్చింది.

కారువేపు చూసి ఆశ్చర్యపోయింది.

అతనెవరో కారును తుడుస్తున్నాడు.

వయసు ఇరవై ఐదు లోపే వుంటాయి.

పెరిగిపోయిన గెడ్డం... పీక్కుపోయిన మొహం...తొడుక్కున్న ప్యాంటు మురికిపట్టి పోయివుంది వంటిమీద చొక్కా లేదు.

తన అనుమతి లేకుండా అతను కారును తుడ వడం తనకి కోపం తెప్పించింది. "ఎవర్నువ్వు" అడిగింది తను.

అతను వులిక్కిపడి తుడవడం ఆపి తనవేపు చూశాడు.

"ఏం చేస్తున్నావిక్కడ?"

"కా...కా...కారు తుడుస్తున్నాను" తల వంచుకొని అన్నాడు.

"ఎవరు తుడవమన్నారు?"

"ఆ...ఉహూ...నేనే తుడుస్తున్నాను"

"ఎందుకు?"

"అన్నంతిని నాలుగు రోజులవుతోంది."

"అందుకని..."

"ఏ పనయినా చేస్తేనేకదా కడుపు నిండేది— ఏ పనీ దొరకలేదు ఇలా కారు తుడిస్తే పావలా డబ్బులు అయినా ఇవ్వకపోతారా అని..."

నా మనస్సు కలుక్కుమంది. ఈ దౌర్భా

గ్యపు దేశంలో ఇలా ఎందరు నిర్భాగ్యులున్నారో ఎందరు ఆకలి మంటలతో అలమటిస్తున్నారో—? కారు తుడవమని నేను నీకు చెప్పలేదే?"

"క్షమించండి మీ కిష్టం లేకపోతే ఏమీ ఇవ్వొద్దు" అనేసి అతను ముందుకు వెళ్ళిపోయాడు.

ఎంత ఆత్మాభిమానం అతనికి. "మిష్టర్..." పిలిచింది తను.

అతను ఆగిపోయాడు.

హ్యాండ్ బ్యాగులోంచి ఓ నోటు బయటకు తీసింది. "తీసుకో" అంది.

"యాభై రూపాయలా!" ఆశ్చర్యపోయాడతను.

"ఏం సరిపోదా?"

"అదికాదండీ. అంత డబ్బు నాకెందుకు? మీ కంతగా దయవుంటే చిల్లర పారేయండి."

"నా దగ్గర ఈ నోటు తప్ప మరేంలేవు"

అతను క్షణం మాట్లాడలేదు. "పోనీలెండి ఈ సారి కనిపించినపుడు యిద్దురుగాని."

ఏమిటితను! డబ్బు ఇస్తానంటే కాదంటాడు. "ఫర్వాలేదు. తీసుకో...తీసుకో...తీస్కో...." బలవంతంగా అతని చేతుల్లో నోటుంచింది.

అతను అయోమయంగా నోటువేపు నా మొహంవేపు చూశాడు.

అతని కళ్ళలో ఏదో వింత కాంతి.

వదనంలో వెలిగిపోతున్న ఆనందం.

గభాల్న అతడు తన కాళ్ళమీద పడిపోయాడు.

అదిరిపడి కాళ్ళను వెనక్కి లాక్కుంది.

అతను అలానే కూర్చుండిపోయి ఏడ్చేస్తున్నాడు.

మనసంతా అతనిమీద సానుభూతితో నిండిపోయింది.

"ఏడవకు. పైకిలే...ఊ...లే..."

అతను ఏడుపును దిగమింగుకుంటూ పైకిలేచి నిలబడ్డాడు.

"ఎందుకలా ఏడుస్తున్నావ్—?"

"ఏమో నాకే తెలీదు"

"నీకు వుద్యోగం కావాలా?"

"ఆ...అవునవును!" అతను ఆశగా చూశాడు.

అతను ఏంపని చేయగలడు? ఇంట్లో నౌకరుగా వుండేసుకుంటే బాగానే వుంటుంది...నౌకరా, ఛ ఇతన్ని చూస్తుంటే కొద్దోగొప్పో చదువుకున్న వాడిలా కనిపిస్తున్నాడు. "ఏం చదువుకున్నావు?"

అతను జేబులోంచి ఓ పొడవాటి కవరు తీసిచ్చాడు.

కవరులోంచి కాగితాలు బయటకు తీసి చూసింది.

ఆశ్చర్యం! అవి మామూలు కాగితాలు కావు. సర్టిఫికెట్స్...బి.ఏ. సర్టిఫికెట్ తో పాటు మెరిట్ స్పోర్ట్సు...ఇంకా చాలా వున్నాయి.

ఇతను బి.ఏ. చదివాడా! తను వూహించలేకపోయింది. ఎంత పొరపాటుగా అంచనా వేసింది. ఇతని ఆకారాన్ని చూసి నౌకరు వుద్యోగానికి పనికివస్తాడనుకుంది...కానీ...యితను ...యిక ఆలోచించలేకపోయింది. "కారెక్కు" ఆ మాట దాదాపుగా అరిచినట్టుగా అంది.

అతను చిత్తరపోయి చూశాడు.

"కారెక్కు" ఈసారి సౌమ్యంగా అంది.

అదీ గొప్ప! —సుగుణాకర్





**అలక**

"మీ ఆవిడకి కోపంవచ్చింది, అలిగింది అని నువ్వెలా కనిపెడతావు?" అడిగాడు మూర్తి రావుని.

"వెరీ సింపుల్. అపుడు మా ఆవిడ నా కిష్టంలేని చీర, నా కిష్టంలేని కాకరకాయ కూర, హెయిర్ స్టయిల్, నాకు నచ్చని రంగు దుప్పటీ— ఇవన్నీ ప్రత్యక్షమవుతాయి..." చెప్పాడు రావు

—ఆర్. శోభారాణి (హైదరాబాద్)

అతను కదల్లేదు విస్మయచకితుడై చూస్తున్నాడు.

"అలా చూస్తావెందుకు...ముందు కారెక్కు"

అతనిలో ఒక్కసారిగా చైతన్యం వచ్చినట్లు గభాల్న కారుడోర్ ఓపెన్ చేసి ఎక్కబోయాడు.

"అవును నీ షర్ట్ ఏది?"

"ఇదిగో" అంటూ చేతిలో వుండచుట్టుకుపోయున్న మురికిగుడ్డను చూపించాడు.

"ఇదేమిటి?"

"నా షర్ట్ తోనే మీ కారు తుడిచాను"

మతిపోయింది తనకి.

ఏ పరిస్థితులు అతన్నిలా దిగజార్చేశాయి.

అతనిమీద ఏదో జాలి ఏర్పడిపోయింది.

బహుశా యీ జాలితోనే అతన్ని చేరదీసుంటుంది.

రెండు రోజులు పోయినతర్వాత అతన్ని చూసి ఎంతగానో ఆశ్చర్యపోయింది.

ఎవరో కొత్తవ్యక్తి అనుకుంది.

అతని మొహంలో ఏదో జీవకళ కదలాడుతోంది. ఇతీర్దిన తెల్లటి బట్టల్లో లక్షాధికారి కొడుకులా వున్నాడు బీచ్ దగ్గర తను చూసిన వ్యక్తికి, యితనికీ చాలా తేడావుంది.

"ఎంత అందంగా వున్నాడు!" అని అనుకోకుండా వుండలేకపోయింది.

అతనికోసం యిన్ని చేసి ... అతనికంటూ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి...అతన్నొక మనిషిగా తీర్చిదిద్దింది.

ఎందుకు? దేనికి? ఏమి ఆశించి?

ఆశించడమా...అంటే...ఒక మగవాడి దగ్గర ఆడది ఆశించేదంటూ ఏం వుంటుంది...ఏమిటది..



### ప్రమోషను

ముద్దాయి గంగులు బోనులో నిలు చున్నాడు.

"గత పదిహేను సంవత్సరాలుగానిన్ను చూస్తున్నా" అన్నాడు జడ్జి.

"మీకు ప్రమోషన్ దొరక్కపోవడానికి నేను కారణం కాదు" అన్నాడు గంగులు తక్కున.

—గుమ్మా నిత్యకళ్యాణమ్మ (జబల్పూర్)

అదే—అదేనా...ఛ ఛ కాదు...తను ఆ విధంగా ఆశించి యుండలేదు.

మరి! ఏమిటి ఆత్మవంచన—

ఇది ఆత్మ వంచనా—?

అవును. ఖచ్చితంగా ఆత్మవంచనే. కాకపోతే మొన్నరాత్రి ఎందుకలా ప్రవర్తించింది తను...?

మొన్నరాత్రి జరిగిందేమిటి?

ఆకాశంలో చంద్రుడు వెలిగిపోతున్నాడు.

వెన్నెల విరగకాస్తోంది.

మల్లెలు విరబూస్తున్నాయి.

వాతావరణం రెచ్చగొడుతోంది.

అనుభవాలఅనుభూతులు మనసును ఎక్కడికో లాక్కుపోతున్నాయి. అణగారిపోయిన కోర్కెలు రెక్కలొచ్చి శరీరాన్ని కసిగా కాటు వేస్తు న్నాయి.

ఏమిటిది...ఏమిటి వేడిసెగలు......కాల్చి వేస్తున్న నిట్టూర్పులేమిటి?

మెదడులో నరాల సంకేతం.

మనసులో వలపు సంగీతం.

ఈ చిత్రహింస భరించడం ఎవరితరం?

తల పగిలిపోతోంది.

ఆ సమయంలో అతనొచ్చాడు.

ఇంత అర్ధరాత్రి ఎందుకొచ్చినట్లు?

"రేపు ఆఫీసులో ఆడిటింగ్ వుంది...రిపోర్టు తయారయేసరికి ఇంత సమయం పట్టింది. మీరు వాటిని చూస్తారేమోనని..."

"వాటీజ్ దిస్ నాన్సెన్స్...ఎప్పుడూ బిజి నెస్ గొడవలేనా?"

"అదికాదు మేడమ్...ఎక్కౌంట్స్..."

"లీవ్ దట్ బ్లడీ టాపిక్"

అతనికి ఇక మాట్లాడే అవకాశం లేక నేల చూపులు చూస్తుండిపోయాడు.

"ఏయ్...యిలారా..."

అతను కదల్లేదు.

"ఎందుకలా ఆడపిల్లలా సిగ్గుపడతావ్... తలెత్తి ఇలా చూడు"

అతను తలెత్తి చూశాడు.

నా కళ్ళు అతనిలో ఏవో వెతుకుతున్నాయి.

అతని కంటి కనుపాప నీడల్లో ఆయన కదులు తున్నారు.

ఏదో ఆవేశం...పిచ్చెక్కి పోతున్నట్లు.

గభాల్న అతన్ని కౌగిలించేసుకుని...ముద్దులతో ముంచేస్తూ...

అతను వుక్కిరిబిక్కిరయిపోయాడు. కంగారు పడి పోయాడు. "మేడమ్...మేడమ్" గింజు కుంటున్నారు.

మానవుడు అన్నీ జయించగలడు. యీ ప్రక్క తినే...యీ వెధవ ప్రకృతిని జయించలేడెందుకో?

ఏం జరుగుతుందో......తనేమయిపోతోందో తనకే తెలీడంలేదు.

తన చెంప పగిలిపోయింది.

అతని కళ్ళలో నిప్పుల వర్షం.

తన కళ్ళలో గిర్రున తిరిగిన నీళ్ళు.

ఎంత అవమానం...తనతల నరికేసినట్లు...

అతనివేపు చూడలేక పోయింది. దుఃఖంపొర్లు కొచ్చింది. బెడ్మీద బోర్లాపడి వెక్కి వెక్కి ఏడ్చేసింది.

దూరమైపోతున్న అడుగుల చప్పుడు—

ఓరగా చూసింది.

కన్నీటి మసక పొరలలోంచి అతను దూర మవుపోతూ—

అతను వెళ్ళిపోతున్నాడు.

ఎందుకు...ఎక్కడికి...ఎక్కడికి వెళ్ళిపోతు న్నాడు?

ఆ మర్నాడు అతను ఆఫీసుకి రాలేదట. ఇంట్లోకూడా లేడట. మరి ఏమయిపోయాడు?

తన మనసంతా ఆందోళనతో నిండిపోయింది.

అతని కోసం కారేసుకుని పిచ్చికుక్కలా వూరంతా తిరిగింది.

అతను కనిపించలేదు.

ఎందుకో ఏడుపొచ్చేసింది...భోరున ఏడ్చే సింది...

ఏమిటీ అనుబంధం—?

ఇవ్వాళ మధ్యాహ్నం—అతన్నుంచి లెటర్.

ఈ వుత్తరంలో ప్రతి అక్షరం అతని వున్నతమైన మనస్సు చాటుతున్నాయి.

ఎన్నిసార్లు చదివింది వుత్తరం.


బాధతో గుండెలు బరువెక్కిపోయి పగిలి పోతున్నాయి.

ఏదో నేరం చేసినట్లు మనసు గిల్టీగా పీంప్తోంది.

'శ్రీమతి...గార్కి,

నమస్కారాలు. ఏ నీడా లేని నాకు నీడనిచ్చి ఆదరించారు. ఆకలితో మాడిపోతున్న నాకు పంచ భక్ష్య పరమాన్నాలే పెట్టారు. ఎక్కడోరాలిపోవం సిన నేను మీదయతో ప్రాణం పోసుకొని, నేనూ ఓ మనిషిలా నిలబడ్డాను. రూపాయి విలువచేయని నేను మీ చల్లని చూపుతో ఆర్థికంగా నిలబెట్టి బ్రత

మంచి జాతి —ప్రమోద్



కడానికి వీలు కల్పించారు. మీ నీడన బ్రతుకుతున్న నేను...మీ తిండితింటున్న మనిషిని నేను. మీరు నాకు చేసిన సౌకర్యాలు చూసి నేను ఎంతగానో ఆనందపడి పోయేవాడ్ని. మీ పాదాలకు మొక్కాలని...మీకు చేతులెత్తి మొక్కాలని అనిపించేది.

మీరంటే నాకెంతో గౌరవము-ఎనలేని అభిమానం. మీ ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చలేను. ప్రతి జన్మ మీమీద కృతజ్ఞతతో నిండిపోవాలని...మనిషిగా జన్మించకపోయినా కనీసం కుక్కగానైనా పుట్టి మీ పాదాలచెంత పడి వుండేట్లు చేయమని ఆ భగవంతుడ్ని ఎన్నోసార్లు వేడుకున్నాను. నా మనసులో నా తల్లిదండ్రులకు కూడా ఇవ్వలేని మహోన్నత స్థానాన్ని మీకిచ్చాను.

ఆ రాత్రి మీ గదిలోకి వచ్చినపుడు...తలుచుకుంటేనే ఎంతో భయంకరంగా... అసహ్యంగా కనిపిస్తోంది. ఎందుకు మీరలా ప్రవర్తించారో అంత కాకపోయినా కొంతైనా ఊహించగలను. అందుకు కారణం నేనే అనుకుంటా. ఎన్నాళ్ళ నుంచి నా మీద మీకు కోరిక పెరిగిపోయిందో నాకు తెలీదు. నేను మీ కళ్ళఎదుట వుండబట్టేకదా మీరలా ప్రవర్తించారు...వద్దు...మీరలా దిగజారిపోకూడదు. మిమ్మల్ని ఆ స్థితిలో చూడలేను. మీరు ఇంకా ఎంతోమంది నాలాటి అనాథలకు ఆశ్రయమివ్వాలి. అందరి హృదయాల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోవాలి. అదే నా కోరిక. నా కోరిక నెరవేరాలంటే మీకు నేను కనిపించకూడదు. నేను మీ ఎదుటే వుంటే మీరు మానసికంగా కుమిలిపోతారు, అందుకే వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో ఏమిటో నాకే తెలియని చోటికి...ఇక జీవితంలో ఎప్పుడైనా మీకు కనిపిస్తానో లేదో నాకే తెలీదు మీమీద చేయి చేసుకున్నందుకు నన్ను క్షమిస్తారు కదూ...క్షమించరూ...'

ఉత్తరం కన్నీటితో తడిసిపోతోంది అక్షరాలు చెరుగిపోతున్నా అతని రూపం చెదిరి పోవటం లేదు. 'అతడు తనకి కనిపించడా...అతడిక రాడా...అతడు తిరిగి రాడా...' హృదయం మూగగా ఆక్రోశిస్తోంది ✱




### అంకితం

"ఈ కథ నీకు అంకితం ఇస్తున్నా. ఎలా వుంది?" అడిగాడు రంగనాథం, సుందరిని.

"కథ రాయకుండా తెల్ల కాయితాలే ఇచ్చి వుంటే కనీసం ముగ్గులైనా వేసుకునే దాన్ని..." అంది సుందరి.

—తె నాగేశ్వరరావు (శివరాం)


ఔను, ఎడతెగని ఆదాలు.
ఎందుకంటే అవి మీకొక భద్రతాయుతమైన సౌభాగ్యానుభవం కలిగిస్తాయి.

మా ఆదర్శవంతమైన పథకాలలో దేనినైనా ఒకదాన్ని ఎన్నుకొని మీ పరమావధిని సాధించండి.

మీ పరమావధిని సాధించడానికి ఇదే సులువైన మార్గమని మీరే తెలుసుకుంటారు.

KCUB

దీ కుంభకోణం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్:
కుంభకోణమ్-612 001

సంరక్షణకు అభివృద్ధికి

APRC/TEL

బ్రాంచి : 5-9-30/6-15, మెయిన్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాదు-500029